ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 14 ఆగస్టు 2025



జెండా ఆవిష్కరించనున్న మంత్రి అడ్లూరి

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలల్లో రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, ట్రైబల్, మైనార్టీ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ జరగనుంది. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో పంద్రాగస్టు వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతు

మెట్‌పల్లిరూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగరావుపేట గ్రామంలో మిషన్ భగీరథ మంచినీటి పైపులైన్లకు పంచాయతీ కార్యాదర్శి కళ్యాణ్ బుధవారం మరమతులు చేయించారు. గ్రామానికి సరఫరా చేస్తున్న మిషన్‌భగీరథ నీటిపై గ్రామస్థులు అధారపడి ఉన్నారు. గత కొంత కాలం నుంచి గ్రామానికి వచ్చే మంచి నీటి పైపులు పగిలి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుంది. దీంతో పంచాయతీ కార్మికులు తాత్కలిక మరమ్మతులు చేసిన పైపులు పగిలి పోతున్నాయి. పంచాయతీలో నిధులు లేక మరమతులు చేయించాలేక తాత్కలికంగా చేయిస్తూ వేసవి కాలం వెళ్లదీశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా పంచాయతీలో నిధులు లేకున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోయినా గ్రామస్థులకు మంచి నీటిని సరఫరాల చేయాలనే లక్ష్యంతో మరమతులు చేయించినట్లు మండల అధికారులు తెలుపుతున్నారు.

పొడిగింపా.. పర్సన్ ఇన్‌చార్జీలా..?



జగిత్యాల వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

- నేటితో ముగియనున్న సహకార పాలక వర్గాల గడువు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు
- జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల గడువు గురువారంతో ముగియనుంది. దీంతో సహకార సంఘాల పాలకవర్గాల గడువు పొడిగిస్తారా లేక పర్సన్ ఇన్ చార్జీలను నియమిస్తారా అన్న చర్చలు జోరుగా సాగుతున్నాయి. వాస్తవానికి సహకార సంఘాల పాలక వర్గాల గడువు ఆరు నెలల క్రితమే ముగిసింది. గడువు ఆరునెలలు పొడిగించి అధికారాలు పాత పాలక వర్గాలకు కట్టబెట్టారు. సంబంధిత గడువు సైతం గురువారంతో ముగుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో సహకార సంఘాల పాలకవర్గాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

● 1.50 లక్షల మంది సభ్యులు

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.50లక్షల మంది సభ్యులున్నారు. కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ జగిత్యాల జిల్లా పరిధిలో 17బ్రాంచీలు ఉన్నాయి. 2019 సంవత్సరం ఫిబ్రవరిలో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గాల గడువు ముగియడంతో ఆరునెలల పాటు పొడిగించారు. గురువారం నాటికి ఆ గడువు సైతం ముగుస్తుండడంతో ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. పాలక వర్గాలను మరిన్నిరోజులు పొడిగిస్తారా లేక పర్సన్ ఇన్‌చార్జీలుగా అధికారులను నియమిస్తారా అన్నచర్చలు జరుగుతున్నాయి. పంద్రాగస్టు రోజున సహకారసంఘాలు, డీసీఎంఎస్‌ల ఎదుట జాతీయజెండాను ఎగురవేసే అవకాశం తమకు ఉంటుందా? లేదా అని ఆయా సంఘాలఅధ్యక్షులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

● జిల్లాలో కొత్తగా ఏర్పాటు కానున్న సొసైటీలు..

ఇటీవల ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు స్వీకరించింది. జిల్లావ్యాప్తంగా 53 సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన సొసైటీలను అధికారులు ప్రతిపాదించారు. జిల్లాలో 12కొత్త సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో మోరపల్లి, పోరండ్ల, లక్ష్మీపూర్, మద్దులపల్లి, రాపల్లి, వర్షకొండ, జగ్గసాగర్, కొత్త దాంరాజ్‌పల్లి, బుగ్గారం, మన్నెగూడెం, అంబారిపేట గ్రామాల్లో కొత్తగా సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. దీంతో పాటు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సిఫార్సు మేరకు జిల్లాలో రాయికల్ మండలం కట్కాపూర్‌లో ట్రైబల్ సొసైటీని ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదించారు.

● విస్తరణ జరిగేనా..?

రైతులకు సహకార సంఘాల సేవలు మరింత చేరువగా తీసుకొని రావాలని గతంలో కేంద్ర ప్రభుత్వం విస్తరణకు నిర్ణయించింది. జిల్లాల ఏర్పాటు తర్వాత నూతన జిల్లాల వారీగా శాఖల విభజన పూర్తయి ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. కానీ డీసీసీబీల విస్తరణ మాత్రం జరగలేదు. ఈ అంశం కేంద్రం పరిధిలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యపడలేదు. దీంతో డీసీసీబీ సేవలు కరీంనగర్ నుంచే కొనసాగుతున్నాయి. సహకార బ్యాంకు శాఖలు

- మిగతా 8లో

చెరుకు రవాణా వ్యయాన్ని ప్రభుత్వం భరించాలి

● మంత్రి శ్రీధర్‌బాబుకు రైతుల వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న చెరుకు రైతులు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి కామారెడ్డి ప్రాంతంలోని చక్కర కర్మాగారాలకు చెరుకును తరలించడానికి అదనపు రవాణా భారం పడుతోందని, రవాణా వ్యయాన్ని ప్రభుత్వం నుంచి ఇప్పించాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌లకు పలువురు రైతులు వినతిపత్రం అందించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌కు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు నేతృత్వంలో పలువురు చెరుకు రైతులు కలిసి గోడును వెల్లబోసుకున్నారు. జిల్లాలో సుమారు 1500 ఎకరాల వరకు రైతులు చెరుకును సాగు చేస్తున్నారని, సుమారు 50 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. జిల్లాలోని ముత్యంపేట ఎన్‌డీఎస్‌ఎల్ కర్మాగారాన్ని పునరుద్ధరించడానికి సమయం పడుతున్నందున ప్రస్తుతం పండించిన చెరుకును కామారెడ్డి జిల్లాలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడి చెరుకు కామారెడ్డికి తరలించడానికి రూ.650 నుంచి రూ.750 వరకు వ్యయం అవుతోందని వాపోయారు. దీంతో రైతుల సమస్యలపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపజేస్తానని హామీనిచ్చారు. వివరాలు సేకరించి ఇవ్వాలని అక్కడే ఉన్న కలెక్టర్ సత్య ప్రసాద్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు వాకిడి సత్యం రెడ్డి, నాయకులు రుత్త నారాయణ, బద్దం సోమిరెడ్డి, కూంద్ర శ్రీనివాస్ రెడ్డి, ఇట్టెడి నారాయణ, లింబారెడ్డి, జెట్టి లింగం, కుతుబోద్దిన్ పాషా, ఎండీ షాకీర్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

● కలెక్టర్ సత్యప్రసాద్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, డీఈవో రాము, మానసిక వైద్యుడు సాకేత్ రెడ్డి, సంక్షేమాధికారి నరేష్, ఏవో శశికళ, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్‌ఆలీ ఖాన్, రఫీక్ ఖాన్, ఆర్ఐలు కిరణ్ కుమార్, సైదులు ఉన్నారు.

108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున 108 సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా 108 సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన వారిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 108 సిబ్బంది సేవలను ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధివారి ఏ.శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. వాహనంలో ఆక్సిజన్ సిలిండర్, స్పైన్‌బోర్డ్, అత్యవసర వైద్య పరికరాలు వాటి పని తీరును పరిశీలించారు. భారీ వర్షసూచనలు ఉన్నందున అత్యవసర సేవల కోసం అనుక్షణం సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా మేనేజర్ కుమారస్వామి, కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, హెచ్‌ఈఓ రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

పెగడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ పెగడపల్లి మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లిలో బీఆర్ఎస్ పార్టీ జండా ఎగురవేసి ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరిస్తూ , ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో హామీల అమలులో వైఫల్యం ఎండగట్టాలని కోరారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలన్నారు. సమావేశంలో నాయకులు ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఉప్పులంచ లక్ష్మణ్, తిరుపతి రెడ్డి, సంతోష్, రాఘవరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, ఆనంద్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు తల్లి ప్రేమలత ఇటీవల మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం సాయంత్రం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అంతక ముందు జగిత్యాల ఆర్డీవో మదుసూధన్‌గౌడ్ పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీటీ ఆర్.ఐ కరుణాకర్, అటవీ శాఖ అధికారులు ప్రవీణ్, ఆనందరావు, అశ్విని, సిబ్బంది రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● విప్ ఆది శ్రీనివాస్



దూలూరులో మాట్లాడుతున్నప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఆగస్టు 13 : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాజకీయం కోణంలో చూసి రాద్ధాంతం చేసే సంస్కృతి మంచిది కాదని ఆయన అన్నారు. మండలంలోని దూలూరు శివారులో ఉన్న వరద కాలువలో ప్రవహిస్తున్న నీటిని పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటు ఎల్లంపల్లి, ఇటు ఎస్ఆర్ఎస్‌పీలో సరిపడా నీరు నిల్వ లేకపోవడం వల్ల వరద కాలువకు నీటి విడుదలలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఎస్ఆర్ఎస్‌పీలోకి 35 టీఎంసీలు దాటగానే నీటిని విడుదల చేశామని గుర్తు చేశారు. రాష్టంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో తాను రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సూరమ్మ చెరువు మత్తడి, తూములు, కట్ట నిర్మాణ పనులు రూ.6 కోట్లతో పూర్తి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 3500 ఇళ్ళు నిరుపేదలకు అందించగా పనులు శరవేగంగా సాగుతున్నాయని దీంతో పేదల కళ్ళల్లో ఆనందం కనిపిస్తోందని పేర్కొన్నారు. రాళ్ళవాగు ప్రాజెక్ట్ కుడికాలువకు పడిన గండిని పూడ్చడంతో పాటు కాలువ, తూము మరమ్మతులు కూడా పూర్తి చేయించి రైతులకు నీరందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి. ధనుంజయ్‌రెడ్డి, అంబటి రాధాకృష్ణ, జవ్వాజి రవి, ఎగ్యారపు శ్రీహరి, సత్యనారాయణ, గడ్డం చిన్నారెడ్డి, స్వామిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి తదితరులు ఉన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహనీయుడు సర్ధార్ సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గొల్లపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వృత్తి రీత్యా కల్లుగీత కార్మికుడు అయినప్పటికీ సైన్యంలో సామాజిక న్యాయం పాటించి గోల్కొండ ఖిల్లా జయించిన వీరుడు అని కొనియాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలు పెట్టిన వారి స్ఫూర్తిని తీసుకొని విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కుల పరమైన, వృత్తి పరమైన అంశాల్లో అండగా ఉంటామన్నారు. వృత్తి పరమైన నైపుణ్యాలు, ఉపాధి పెరిగి, ఉన్నత విద్యా అవకాశాలు మెరుగు పర్చుకుని ముందుకు పోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 40లక్షల ఈత మొక్కలు, 5లక్షల తాటి మొక్కలు నాటి సంరంక్షించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం నుండి ఉపాధి హామీ నుండి మొక్కలు నాటి పెంచే వరకు గీత కార్మిక సంఘాలదే బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, పలువురు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 8

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి

● అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక 7



ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ అంకం జనార్దన్‌పద్మ దంపతులు 50వేల 116రూపాయల నగదును అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, ఆలయ పూజారి నాగరాజు రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలి

రాయికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని రాయికల్ ఎంపీడీవో చిరంజీవి అన్నారు. రాయికల్ మండలంలోని పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, వీవోలకు మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, విబిన్న ప్రతిభావంతుల సంఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కిశోర బాలికల సంఘాల ఏర్పాటుపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, బ్యాంక్ మేనేజర్లు పవన్, వినయ్, ఏపీఎం నరహరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి పాల్గొన్నారు.

పద్మశాలీలు కలిసికట్టుగా ముందుకు సాగాలి

రాయికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మనమంతా ఐక్యంగా ఉండి సమస్యలు ఎదురైనప్పుడు ఒక్కరి కోసం అందరూ.. అందరి కోసం ఒక్కరు అన్నట్లుగా కలిసికట్టుగా ముందుకు సాగాలని రాయికల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ హాజరై నూతన అధ్యక్షునిగా బోగ రాజేశం, ఉపాధ్యక్షునిగా దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేష్, కోశాధికారిగా ఆడెపు నర్సయ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి జక్కుల చంద్రశేఖర్, మాజీ కార్యదర్శి మామిడాల లక్ష్మీనారాయణ, మాజీ ఉపాధ్యక్షులు శ్రీరాముల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అనుమండ్ల తేజ, పోపా సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకాలేజ్ ఆవరణలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అదే విధంగా జాతీయ రహదారి పక్కన పెరిగిన మొక్కలను, చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం చైర్మన్,ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తొంటి దేవన్న, లెక్చరర్లు అంజయ్య,శ్రీకాంత్,దశరథం,సత్యశోధన్, బోధన, బోధనేతర సిబ్బంది లక్ష్మీనారాయణ,బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ప్రజల అభీష్టం మేరకు కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాల్సిందేనని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి మధుయాష్కీ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యలయలంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపినప్పటికీ ఢిల్లీలో మాత్రం అడ్డుకోవడం విడ్డూరమన్నారు. తమిళనాడులో 68 శాతం రిజర్వేషన్స్ సాధ్యమైనప్పుడు.. తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రజలు భాగస్వామ్యమై ఉద్యమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మెట్‌పల్లి పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, అంజిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జలపతి రెడ్డి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాదినంటూ..
మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సిరిసిల్లక్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదినంటూ పలువురిని మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. సిరిసిల్ల పట్టణ సీఐ కె కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏనుగు ఫణీందర్ అనే వ్యక్తి న్యాయవాదిలా చలామణి అవుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడు. మచ్చ నారాయణ అనే వ్యక్తి కొడుకుకు విడాకులు ఇప్పిస్తానని చెప్పిన ఏనుగు ఫణీందర్ ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నాడు. ఆ బాండ్ పేపర్లపై మచ్చ నారాయణకు చెందిన ఇంటిని బొల్లి మార్కండేయ, బాలకృష్ణలకు అమ్మినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. ఇంటిని అమ్మినట్లు సృష్టించిన పత్రాలతో మచ్చ నారాయణను బెదిరించి వారి నుంచి 11లక్షల 60వేల రూపాయలు తీసుకున్నాడు. ఈ విషయమై మచ్చనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఏనుగు ఫణీందర్, బొల్లి మార్కండేయలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా జైలు నుంచి వచ్చిన ఏనుగు ఫణీందర్ బొల్లి మార్కండేయ కొడుకు బాలకృష్ణను సైతం పోలీసులు అరెస్టుచేస్తారని తనకు హైకోర్టు న్యాయవాదులు తెలుసునని బాలకృష్ణను అరెస్టు చేయకుండా బెయిలు తీసుకువస్తానని చెప్పాడు. లక్షా11వేల రూపాయలు తీసుకుని బెయిల్ ఇప్పించకుండా మోసం చేశాడు. దీంతో బొల్లి మార్కండేయ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం పాశిగామా హరిత హోటల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడి గణేష్ (24) అనే యువకుడు, ముచ్చకుర్తి అనిల్(25) అనే కానిస్టేబుల్ మృతి చెందారు. ఎస్ఐ ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సు పాశిగామ సమీపంలోని హరిత హోటల్ వద్ద గేదెను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న లక్షెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన మేడి గణేష్, ముచ్చకుర్తి అనిల్ తీవ్రంగా గాయపడగా అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన గణేష్‌ను ఆసుపత్రి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలో మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

గోడ కూలి ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీవర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో, పత్తిచేనుల్లో నీరు నిలవడంతో పాటు కొన్ని గ్రామాల్లో పురాతన ఇళ్ల నేలకులాయి. పెద్దబొంకూర్ గ్రామంలో కురిసిన వర్షానికి ఎలిగేటి రాయమల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్న తరుణంలో రాత్రి కురిసిన వర్షానికి గోడకూలింది. ఈ ప్రమాదంలో అతడి కుమారుడు శేఖర్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అలాగే బొంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరదనీరు నిలిచిపోయింది.

రోడ్డుపై నిలిచిపోయిన భారీ వాహనం

● ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిపోయిన భారీ వాహనం

శంకరపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాన్ని తీసుకెళ్తున్న లారీ రోడ్డుపై నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శంకరపట్నం మండలం లోని కల్వల గ్రానైట్ క్వారీకి భారీ గ్రానైట్ రాళ్లను లారీల్లోకి ఎత్తే వీల్ లోడర్‌ను తరలిస్తున్నారు. ఈ క్రమంలో నేషనల్ హైవేనుంచి మొలంగూర్‌కు ఎక్స్‌రోడ్‌వైపు తిరగగానే ఆ వాహనం రాడ్ విరిగి లారీ అక్కడే నిలిచి పోయింది. ఈ వాహనం పూర్తిగా రోడ్డుకు అడ్డుగా ఉండడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ తో లారీ వెనకాల మట్టి పోసి వీల్ లోడర్‌ను కిందకి దించారు. తర్వాత మరమ్మతు చేసి లారీని అక్కడి నుంచి తరలించారు.

ఆర్థికాభివృద్ధిలో ఆదర్శం

స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందుకోనున్న ఆదర్శ మండల సమాఖ్య

ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన సభ్యులు

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 'జీవితాన వెలుగుందనే నమ్మకాన్ని పెంచుదాం.. స్వర్గమనేదెక్కడున్నా నేలపైకి దించుదాం..' అనే ప్రార్థనా గీతంతో మహిళా సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయి. సమష్టి నిర్ణయాలతో ఆయా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధిలో ఆదర్శంగా నిలిచి జాతీయస్థాయిలో పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య 2004లో ఏర్పాటు కాగా, ప్రస్తుతం 46 గ్రామైక్య సంఘాలతో, 1103 స్వశక్తి సంఘాలలో 12420మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ వాటి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందిన అనంతరం రికవరీ చేస్తున్నారు. సామాజిక రుగ్మతలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు.

మహిళా సంఘ సభ్యుల పురోగతి..

మండలంలోని పలు గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. మహిళలు సంఘాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకొని పాడి ఆవులు, లేడీస్ ఎంపోరియంలు, బట్టల దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద గ్రామైక్య సంఘాలకు వచ్చిన రూ.1.30కోట్లతో కోడిపిల్లల పెంపకం, క్యాంటీన్లు, కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. కందికట్కూర్, గాలిపెల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల యూనిఫామ్స్ కుడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సంఘంలోని ప్రతి మహిళ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తుండటం వల్ల సమాఖ్య రూ.59కోట్ల రుణాలు పంపిణీ చేసి 99శాతం రికవరీ చేసింది.



కందికట్కూర్‌లో కుట్టుశిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న మహిళలు

ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణ మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించగా మండలంలోని మహిళా సంఘాలు ముందుకు వచ్చాయి. 28గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, మండలకేంద్రంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు నడిపించారు. 28లక్షల 80వేల క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.99లక్షల కమీషన్ పొందారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, గడ్డిచుట్టే యంత్రాలు కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

దేశవ్యాప్తంగా ఉత్తమ మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనితీరును పరిశీలించారు. ఉత్తమ సేవలు అందించే సమాఖ్యలకు 2024 ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డులకు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 22మహిళా సంఘాలను ఎంపిక చేయగా సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్య రెండో స్థానంలో ప్రతిభ కనబర్చింది. ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే ఉత్సవాల్లో అవార్డు అందుకోనున్నారు. సమాఖ్య అధ్యక్షురాలు వల్లంపట్ల గ్రామానికి చెందిన కట్ట సౌమ్య, మాజీ అధ్యక్షురాలు వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన బొడిగే వనజలు ఢిల్లీ వెళ్లారు. ఆదర్శ మండల సమాఖ్య సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించడంతో పాటు నిరంతర ఆదాయం కోసం గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీవోకు ఆదేశాలు ఇవ్వడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా..



రంగు రేణుక, కందికట్కూర్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. కందికట్కూర్‌లో 12మంది సభ్యులం కలిసి కేంద్రంలో రెండు నెలలపాటు యూనిఫామ్స్‌కుట్టడం ద్వారా రూ.4లక్షల వరకు ఆదాయాన్నిపొందాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాణిస్తున్నాం.

క్యాంటీన్‌తో ఉపాధి పొందుతున్నా..



బండారి స్వాతి, ఇల్లంతకుంట

గీతకార్మికుడైన నా భర్త రమేష్ మృతి చెందాడు. కుటుంబ పరిస్థితుల వల్ల ఏదైన వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఇందిరా మహిళాశక్తి కింద బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.3లక్షల రుణం తీసుకొని ఇల్లంతకుంటలో క్యాంటీన్ ఏర్పాటు చేశాను. మొదట్లో కొంత ఇబ్బంది అయినా ప్రస్తుతం బాగానే నడుస్తోంది. ఆర్డర్‌పై ఆహారాన్ని అందిస్తూ పిల్లలను పోషించుకుంటున్నాను. రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నాను. కుటుంబానికి తోడ్పాటు అందించిన ప్రభుత్వానికి, అధికారులకు రుణపడి ఉంటాను.

మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యం



కట్ట సౌమ్య, ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షురాలు

మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మండలంలోని సంఘాల్లో ఉన్న మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తా. ఇప్పటివరకు ఏ గ్రామంలోనైనామహిళలు సంఘంలో లేకపోతే కొత్త సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తా. సామాజిక రుగ్మతలపై మహిళల్లో చైతన్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్నా. ఈనెల 15న ఢిల్లీలో అవార్డు తీసుకోవడానికి బయలుదేరాం.

బీఎడ్ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎడ్ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షలు నియంత్రణ అధికారి డి సురేష్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ నెల 14వతేదీ నుంచి 29వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు కూడా ఈనెల 14వ తేదీ నుంచి 25 వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో గానీ, కళాశాలలోగానీ సంప్రదించాలని సూచించారు.

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సుంకరి ఓదెలుకు చెందిన నాలుగు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఎత్తికెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎత్తుకెళ్లిన మేకల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంబర్ ప్యాకెట్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న అంబర్ ప్యాకెట్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలో అక్రమంగా అంబర్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఆటోలో ఒక లక్ష రూపాయల విలువ చేసే అంబర్ ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన అంబర్ ప్యాకెట్లు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాలుగు రోజులైనా అదుపులోకి రాని మంటలు

● గోదాంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరగ్గా మంటలు నాలుగురోజులైనా అదుపులోకి రాలేదు. రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయినా గోదాం నుంచి దట్టమైన పొగతో మంటలు వ్యాపించడంతో ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. తీసిన సంచుల నుంచి మళ్లీ మంటలు రాకుండా వాటిపై ఇసుక పోస్తున్నారు. గోదాంలోని గోనె సంచుల కింద వేసిన కట్టెలు ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. గోనెసంచులు పూర్తిగా కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. గోదాం దెబ్బతినడంతో రూ.70లక్షల వరకు నష్టం వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. గోదాంను బుధవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించి మంటలను అదుపు చేసేలా తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంటలను గురువారం పూర్తిస్థాయిలో అదుపులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, వరప్రసాద్, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్, ఎస్సై-2 రాజునాయక్ ఉన్నారు.

150 గ్రాముల గంజాయి స్వాధీనం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులవద్ద 150గ్రాముల నిషేధిత గంజాయి పట్టుకున్నారు. నిందితులు షేక్ గౌస్, మహ్మద్ షారు, మహ్మద్ సాహెబ్‌పై కేసు నమోదు చేశామని, 2బైక్‌లు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నిందితులు నాగ్‌పూర్‌లో గంజాయిని కొనుగోలు చేసి చింతకుంటలో ఎక్కువధరకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 10రోజుల జైలుశిక్ష విధిస్తూ ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి బుధవారం తీర్పునిచ్చారు. వెల్గటూర్ ఎస్ఐ ఉమసాగర్ తమసిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ జిల్లాకుచెందిన కండెల ప్రశాంత్(28) పట్టుబడ్డాడు. అతడిపై కేసునమోదు చేసి ధర్మపురికోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ జానకి విచారించి ప్రశాంత్‌కు పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం

● ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ జాబితాలో చోటు



మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్/మంథని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అనలిటిక్స్ ఇండియామ్యాగజైన్ తాజాగా ప్రకటించిన ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025 జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న వ్యక్తులతోపాటు, సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతిఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు దేబజాని ఘోష్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఎంపికపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇది తెలంగాణ ప్రజలందరికీ దక్కిన గౌరవం అని స్పష్టం చేశారు.

నానో యూరియాపై
అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా (లిక్విడ్ యూరియా) వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి మండలంలోని డీసీఎంఎస్ చింతకుంట ఫర్టిలైజర్ దుకాణాన్ని, గోదాంను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎరువుల వ్యాపారస్తులు విధిగా టార్పాలిన్ షీట్,దానిపై వరిఊక్కను వేసి ఎరువు లను నిల్వ చేయాలని సూచించారు. యూరియా బదులుగా అందుబాటులో ఉండే అమ్మోనియా సల్ఫేట్‌వంటి నత్రజని ఎరువులను వాడుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, సహాయవ్యవసాయ సంచాలకులు రణధీర్‌కుమార్, కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి కృష్ణ ఉన్నారు.

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన తాళ్లపల్లి పోచమల్లు అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంటిలో బుధవారం దొంగతనం జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఫంక్షన్ కోసం సుల్తానాబాద్ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికిరాగా ఇంటితాళం పగులగొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 50వేల రూపాయల నగదు, పది తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నరేష్ రెడ్డి, క్లూస్‌టీం పరిశీలించారు. కాగా దొంగతనంపై ఇంకా ఫిర్యాదు రాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళను కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కరీంనగర్ లేక్ అవుట్ పోస్ట్ పోలీసులు బుధవారం రక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌కుచెందిన మల్యాల రాజేశ్వరి (43) భూసమస్యల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. లేక్ అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎంఏ హఫీజ్‌బేగ్ గమనించి ఆమెను కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికే ఆమెపై చందుర్తి పోలీసు ఠాణాలో అదృశ్యం కింద కేసు నమోదైనట్లు గుర్తించి, అక్కడిపోలీసులకు అప్పగించారు.

వేర్వేరు కేసుల్లో నలుగురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

● బంగారం, వెండి, నగదు స్వాధీనం ● బంగారం కొనుగోలుదారుడి అరెస్టు



మానకొండూర్ పరిధిలో చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితుల అరెస్టును చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల చోరీలకు పాల్పడిన నలుగురు అంతర్ జిల్లా దొంగలతోపాటు దొంగసొత్తు కొనుగోలుదారుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద బంగారం, వెండి, నగదుస్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీసు కమిషనరేట్‌కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దీకంపల్లికి చెందిన టేకు గంగ సాయిలు(55), టేకు భూమయ్య(48) అన్నదమ్ములు. కూలి పనులు చేసుకునే వీరు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసు కమిషనరేట్‌లోని మానకొండూర్, శంకరపట్నం, గంగాధర, రామడుగు మండలాల్లో దొంగిలించిన బంగారాన్ని నిర్మల్‌కు చెందిన ఉప్పుల వేణు సహాయంతో నిర్మల్‌లోని భార్త ఎక్నాత్‌శేల్కే అమ్ముతుండేవారు. ఇతను బంగారు షాపు నడుపుతూ దొంగిలించిన ఆభరణాలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో వేణు పరారీలో ఉండగా గంగసాయిలు, భూమయ్యతోపాటు మహారాష్ట్రలోని షోలాపూర్‌కు (ప్రస్తుతం నిర్మల్ జిల్లా మంజులాపూర్‌లో నివాసం) చెందిన భార్తఎక్నాత్ శేల్కే(34)ను అరెస్టుచేశారు. వీరివద్ద 45తులాల బంగారం, 170తులాల వెండి, లక్షా 40వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీవెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసింహులు, మానకొండూర్ సీఐ సంజీవ్, సీఐ ప్రకాష్, ఎస్సై స్వాతి, సిబ్బందినిసీపీ అభినందించారు.

● కరీంనగర్‌లోని వివేకానందపురి భార్గవి ఎంక్లేవ్, వెంకటేశ్వర రెసిడెన్సీలలోని రెండు ఫ్లాట్‌లలో ఈనెల6న రాత్రి సుమారు 32తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈకేసులో రంగారెడ్డి జిల్లా గడ్డి అన్నారంలో నివాసం ఉంటున్న కరీంనగర్‌కు చెందిన దినేష్‌రాజ్ పురోహిత్ అలియాస్ ఠాకూర్ జగన్‌సింగ్ అలియాస్ డీజే(30), కరీంనగర్ జవహర్ నగర్‌లో నివసిస్తున్న కొత్తోజు సందీప్‌చారి అలియాస్ సందీప్(26)ను అరెస్టు చేశారు. 32తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. గతంలో నేరాలకుపాల్పడిన ఈఇద్దరికి చర్లపల్లి జైలులో ఉండగా పరిచయం ఏర్పడింది. జైలునుంచి విడుదలైన తరువాత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని అప్పులు చేశారు. అప్పులను తీర్చడానికి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్‌లో చోరీచేసిన బంగారాన్ని ఎల్లారెడ్డిగూడలోని ఒకఫైనాన్స్‌లో కుదువ బెట్టి డబ్బులు తీసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీ ఎన్ వెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసిం హులు, మూడోఠాణా సీఐ జాన్‌రెడ్డి, సీఐ ప్రకాష్, ఎస్సైలు చేరాలు, రమేష్‌తోపాటు సిబ్బందిని సీపీ అభినందించారు.

11కేవీ వైర్లు తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన బాసుమియా అనేవ్యక్తి 11కేవీ వైర్లు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాసుమియా బుధవారం వర్షం కురుస్తుండగా ఇంటిపైకిఎక్కి, పరదాను సరిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన ఇంటి పైనుంచి వెళ్లుతున్న 11కేవీ కరెంటు వైర్లు అతని చేతికి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాసుమియాను జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం దొంతుల గంగయ్య అనేవృద్ధుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో గంగయ్య తీవ్రంగా గాయపడటంతో అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. రామగుండం మండలం గోలివాడకు చెందిన ఆయన మండల కేంద్రంలోని ఓ వివాహ వేడుకలో పాల్గొని రోడ్డు దాటే క్రమంలో కారు ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘ టన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పాలకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో ఇటీవల చోరీకి పాల్పడ్డ నిందితుడిని బసంత్ నగర్ పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ పుల్ల కరుణాకర్ వివరాలు వెల్లడించారు. అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన పరకాల అశోక్ కొన్నిరోజులుగా మద్యానికి అలవాటుపడి డబ్బు కోసం చోరీలు చేస్తున్నాడు. ఈసాలతక్కళ్లపల్లిలో దాడి నాగరాజు ఇంటికి తాళంవేసి ఉండగా తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 2తులాల బంగారు గొలుసు,పుస్తెలతాడు చోరీ చేశాడు. అదే గ్రామానికి చెందిన పెసరి మల్లేష్ ఇంటికి వేసిన తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న 3తులాల బంగారు హారం చోరీ చేశాడు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లో రాత్రివేళ ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోఉన్న వెండి, బంగారు అభరణాలను దొంగిలించాడు. తాగినమైకంలో బంగారు అభరణాలను ఎక్కడో పడవేయగా మిగతా వెండి వస్తువులను, ఈసాలతక్కళ్లపల్లిలో దొంగలించిన 3తులాల బంగారు ఆభరణాలతో బుధవారం పెద్దపల్లికి వెళ్తుండగా బసంత్‌నగర్ బస్టాప్‌వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతనివద్దనుంచి 3తులాల బంగారు హారం, వెండివస్తువులు సీజ్‌చేసి నిందితుడిని అరెస్టుచేసినట్లు వెల్లడించారు. నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ ఆర్‌స్వామి, సిబ్బందిని ఏసీపీ గజ్జికృష్ణ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లికి చెందిన లెక్కల ప్రశాంత్ ఈ నెల 9న తన మొబైల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల బ్రిడ్జి వద్ద పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యజమానికి బుధవారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి అప్పగించారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. వారివద్ద రూ.15,700నగదు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి.

'స్వరాజ్యం మా జన్మహక్కు.'

అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.



ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్ల

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? అనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు.

ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి నూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహరీ బాయి, 102 ఏళ్ల

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఓరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు తేదీని ఈనెల 27వరకు పొడిగించినట్లు తెలిపారు. బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారని, బాలికలు అధిక సంఖ్యలో దరఖాస్తులను చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు చీర, సారెతో హాజరు



లబ్ధిదారులకు చీర, సారెను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు నూతన కడప ఏర్పాటుకు చీర, సారెతో ఆది శ్రీనివాస్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో చాలా ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇప్పటికే బేస్మెంట్ పూర్తి చేసుకుని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మ గౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మాణం చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి చీర, సారెతో వస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి చీర, సారెతో వచ్చానని గుర్తుచేశారు.

ఆర్టీసీకి రాఖీ బొనాంజా

రీజియన్ వ్యాప్తంగా రూ. 15 కోట్లకు పైగా ఆదాయం





భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజుల్లో 15 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చుకున్నది. కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా 15.48 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. రీజియన్ వ్యాప్తంగా రాఖీ పండుగను పురస్కరించుకుని వివిధ డిపోల నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపించి ఆదాయం సమకూరే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

మహిళలే అధికం

రీజియన్ వ్యాప్తంగా పురుషులకన్నా మహిళలే అధికంగా ప్రయాణించారు. రీజియన్ వ్యాప్తంగా 29,10,435 మంది ప్రయాణించగా అందులో మహాలక్ష్మి పథకం కింద మహిళలు 21,21,668, పురుషులు 7,88,767మంది ప్రయాణించారు. గోదావరిఖని డిపోకు రూ. 2.23 కోట్లు, హుస్నాబాద్‌కు 87.34 లక్షలు, హుజూరాబాద్‌కు 1.17 కోట్లు, జగిత్యాలకు 1.78 కోట్లు, కరీంనగర్-1కు 1.59 కోట్లు, కరీంనగర్-2కు 2.41 కోట్లు, కోరుట్లకు 1.14 కోట్లు, మంథనికి 85.4 లక్షలు, మెట్‌పల్లికి 1.07 కోట్లు, సిరిసిల్లకు 1.17 కోట్లు, వేములవాడకు 1.14 కోట్ల ఆదాయం వచ్చింది.

ఆర్టీసీని ఇలాగే ఆదరించాలి



బి రాజు, రీజినల్ మేనేజర్

రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించడంతో అధిక ఆదాయం సమకూరింది. ప్రణాళికా బద్ధంగా అన్ని డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను నడిపించాం. ఆర్టీసీ ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు. అంకిత భావంతో పనిచేసిన ఆర్టీసి సిబ్బందికి అభినందనలు.

కొండగట్టులో పోలీసుల తనిఖీలు

- డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాల స్పెషల్ డ్రైవ్
- ఆలయాల వద్ద భద్రత కట్టుదిట్టంలో భాగంగా చర్యలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మల్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భద్రతపై బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భద్రత చర్యలను బలోపేతం చేయడం కోసం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారం, మండపం, భక్తుల ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, వసతిగృహాలు తదితర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల వద్ద భద్రత చర్యలు మరింత కట్టుదిట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కుగాని డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై నరేశ్ కుమార్, డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలు పాల్గొన్నాయి.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 12,769 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 12,769 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 45.161 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,163 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 2,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూ సెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 39.713 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.563 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


ఉప్పొంగంగా..

పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తిపోతలు ప్రారంభం



రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ధర్మారం/రామడుగు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి లింక్ -2 నంది పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. నంది మేడారం సమీపంలోని నంది పంప్‌హౌస్‌కు గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి నుంచి నీటిని వదిలి పెట్టగా, అక్కడి నుంచి మూడు మోటార్లను ప్రారంభించి 9,450 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాలతో కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. అక్కడి నుంచి 11,478 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా వదిలి పెట్టడంతో ఆ నీటితోపాటు, పరివాహక ప్రాంతం నుంచి 7,584, మొత్తం 19, 062 క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లికి వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు 14.069 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ముందస్తు చర్యగా మండలంలోని నంది మేడారంలోని నంది పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్‌లో మూడు మోటార్లను ఆన్ చేసి అంతే నీటిని గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అక్కడి నుంచి నేరుగా వరద కాలువ ద్వారా శ్రీ రాజ రాజేశ్వర డ్యాంకు నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రక్రియ వారంపాటు కొనసాగుతుందని అధికారులు తెలి పారు.



ధర్మారం మండలం నంది పంప్ హౌస్ వద్ద ప్రవహిస్తున్న నీరు

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి



గోదావరి నుంచి భక్తులను బయటకు తీసుకు వస్తున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద బుధవారం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె నీటిలో మునిగి గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకొని గోదావరి వరద కొనసాగుతోంది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మైకుల ద్వారా అప్రమత్తం చేశారు. కొందరు భక్తులు లోతు ప్రదేశాల్లో స్నానాలు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు ప్రజలను అప్రమత్తం చేశారు.



గోదావరి ఉధృతి

ఆస్తి కోసం తల్లిపై దాడి

● చికిత్స పొందుతూ మృతి


గంగరాజు(ఫైల్)

రాయికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో బుధవారం బొల్లె గంగరాజు(70) అనే వృద్ధురాలిపై తనయుడు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం కుమ్మరిపల్లికి చెందిన బొల్లె గంగరాజు భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. గంగరాజుకు లక్ష్మణ్, గంగరాజం ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం సాయంత్రం చిన్నకుమారుడు గంగరాజం ఆస్తి విషయంలో తల్లితో గొడవ పడి కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గంగరాజును చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా బుధవారం రాత్రి మృతి చెందింది.. సంఘటనస్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేస్తున్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

రాయికల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన మామిడిపెల్లి శ్వేతతండ్రి లచ్చయ్య చిన్నతనంలోనే మరణించాడు. అప్పటి నుంచి అద్దె గృహంలో కిరాయికి ఉంటూ డిగ్రీ పూర్తి చేసింది. ఈ నెల14న గురువారం శ్వేత వివాహం కుదిరింది. తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమకు సహాయం చేయాలని శ్వేత తల్లి గంగు ప్రార్థించింది. విషయం తెలుసుకున్న రామాజీపేట గ్రామానికి చెందిన నేతుల మహేష్-వనిత రూ.5016 కాకుస్తం వెంకట కృష్ణ, నూకల గంగాధర్ చేతులమీదుగా అందజేశారు. ఇంకా ఎవరైనా సహాయం చేయాలనుకునేవారు 93466 68554 నెంబర్‌కు ఫోన్ పే ద్వారా పంపించాలని వారు కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఈ

జగిత్యాలఅర్బన్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జగిత్యాల నీటిపారుదల శాఖ సర్కిల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన యం. రమేష్ బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఆయన వెంట ఈఈ చక్రూనాయక్, డిఈ భాస్కర్ ఉన్నారు.

అభివృద్ధికి నిధులు ఇప్పించండి

జగిత్యాల మండలం ధర్మారం గ్రామంలో ఉన్న చర్చి అభివృద్ధి మరియు పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ విషయమై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో అనేక ప్రార్థన మందిరాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన సంగతి ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మాజీ ఎంపిటీసి గిద్దె శంకర్, మాజీ ఉప సర్పంచ్ ధనేశ్వర్ రావుతదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో రైతువేదిక భవనంలో షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మీషన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కుట్టు మీషన్ల పంపిణీ కార్యక్రమంను మంత్రి అధికారులు, నిరుపేద మహిళలతో కలిసి ప్రారంభించారు. గతంలో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుపేద దళిత మహిళలకు కుట్టు మీషన్లను, సంబంధిత ధృవీకరణ పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కుట్టు మిషన్లతో పాటు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి మండల కేంద్రంలో ఇటీవల కేటాయించిన క్రీడా స్థలంలో క్రీడా మైదానానికి సంబంధించిన నిర్మాణం పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎండపల్లి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం ఎండపల్లి మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎండపల్లి ఎంపీడీవోను తన చాంబర్ గదిలో కూర్చుండబెట్టి శుభాకాంక్షలు తెలిపాడు. అనంతరం మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నూతన ఎంపీడీవో భవనాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గుండాటి గోపిక జితెందర్ రెడ్డి, ఎంపీడివో నరేష్ కుమార్ పాల్గొన్నారు.

పొడిగింపా.. పర్సన్ ఇన్‌చార్జీలా..?

(5వ పేజీ తరువాయి)

మినహా కొత్త జిల్లాల్లో మిగితా సేవలు అందుబాటులో లేవు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో సైతం డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని 2024 సంవత్సరంలో నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు.

● అందుబాటులోకి వస్తే..

సహకార జిల్లాస్థాయి అధికారులను సంప్రదించాలంటే ప్రస్తుతం కరీంన గర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాల వారీగా డీసీసీబీలు ఏర్పాటు అయితే సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని రైతులు చెబుతున్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లోనూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా కేంద్ర ప్రతిపాదన మేరకు ప్రతీ మండలానికి రెండు సహకార సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

-మనోజ్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి



గడువు పొడిగింపు ఉంటుందా లేక పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తారా అనే విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటాం.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా కృషి చేయాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో జగిత్యాల, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ప్రయత్నాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలి

కొడిమ్యాల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అర్హులైన మహిళలను సంఘాలలో చేర్చాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 34 గ్రామ సంఘాల పాలక వర్గ సభ్యులకు, సంఘాల సహాయకులకు శిక్షణ కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సంఘాలలో చేరిన మహిళలకు అవసరమైన తోడ్పాటును సెర్ఫ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య బాద్యులు పద్మ, సునీత, సంధ్య, సీసీలు పద్మ, వీరకుమార్, స్వరూప, మంగ కార్యాలయ సిబ్బంది సుకన్య, మాధవి, మహిళా సంఘాల పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అర్హులైన ప్రతి మహిళను సంఘ సభ్యులుగా చేర్చుకోవాలని మల్లాపూర్ మండల సెర్ప్ ఏపీఎం రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఐక్య సంఘాలకు నూతన సంఘాల ఏర్పాటు కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధప్య, దివ్యాంగుల, కిషోర బాలకలు, తదితరులను సంఘాల ఏర్పాటకు, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అందరిని విధిగా సంఘాలలో చేర్చుకోవాలని దిశా నిర్దేశం చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు ప్రభుత్వం అందిస్తున్న వివరాలను తెలియజేశారు. జరిగిన సదస్సులో సీసీలు లక్ష్మిరాజం, రమేష్, రాజు, స్రవంతి, వివోలు, మహిళలు పాల్గొన్నారు.

'అందరూ రక్తదానం చేయాలి'

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతులు మాత్రమే రక్తదానం చేయాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని మాతృశ్రీ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ధర్మపురి బ్లడ్ బ్యాంక్ పేరుతో ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపు ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత పది ఏళ్ల క్రితం ధర్మపురి పట్టణానికి చెందిన బండారి అనిల్, కస్తూరి శరత్ బ్లడ్ బ్యాంక్ గ్రూపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 32 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందారపు రామకృష్ణ, డాక్టర్ మామిడి వినయ్, టీచర్లు గొల్లపల్లి గణేష్, చల్ల శ్రీనివాస్, గరిగె శ్రీనివాస్, వేముల గోపికృష్ణ, శ్రీనివాస్, సాయి, ల్యాబ్ టెక్నీషియన్ తిరుపతి, కేరళ ఇంగ్లీష్ మీడియం, ఆంగ్లోవేదిక్ కాన్వెంట్, ఏసీఈ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి


ధర్మపురిలో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీత, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఎస్సారెస్పీ డీఈ అరుణోదయ్ పాల్గొన్నారు.

●**ధర్మపురి:** భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి తహసీల్దార్‌గా ఏరుకొండ శ్రీనివాస్ అన్నారు. వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి నదిలో భక్తులు లోతు ప్రదేశాలరు వెళ్లి స్నానాలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రవీందర్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** భారీ వర్ష సూచన నేపథ్యంలో గోదావరి నదిలోకి ఎవరూ వెళ్లకూడదని తహసీల్దార్ రమేష్ సూచించారు. బుధవారం ఎంపీడీవో శశికుమార్, ఎస్సై రాజులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

●**కొడిమ్యాల:** వరదలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఎంపీడీవో స్వరూప మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్సై సందీప్, ఏఈఈ చంద్రశేఖర్, ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** వర్షాల నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వర్షాలు అధికంగా కురిస్తే మండలంలోని శాలపల్లి అడుపపల్లి గ్రామాల మధ్యన బ్రిడ్జి వద్ద, నక్కపల్లి సమీపంలో లోలెవల్ కల్వర్టు వద్ద, లింగాపూర్ పెద్ద చెరువు తదితర ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ బి.రవీందర్ పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సూచించారు. మండలంలోని ఎర్దండి, కోమటి కొండాపూర్ గ్రామాల్లోని గోదావరి నది పరివాహ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు.

వరద కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వరరావు పేట గ్రామ శివారులోని వరద కాలువలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మృతదేహం ఎత్తు సుమారుగా 5.2 ఉండి నీలం రంగు షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు, మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ధర్మపురి తహసీల్దార్‌గా శ్రీనివాస్

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల నూతన తహసీల్దార్‌గా ఏరుకొండ శ్రీనివాస్ బుధవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కృష్ణచైతన్య కోరుట్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంచార్జ్ తహసీల్దార్‌గా ఉన్న సుమన్ నుండి జగిత్యాల రూరల్ తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై వచ్చిన శ్రీనివాస్ పదవీ భాధ్యతలు చేపట్టారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో తహసీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్ బుధవారం పూజలు నిర్వహించారు.

గడి బురుజు స్థలం పరిరక్షించాలి

కోరుట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడి బురుజు స్థలం పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల పక్ష నేతలు నిజామాబాదు ఎంపీ అర్వింద్‌కు వినతి పత్రంను అందించారు. నిజామాబాదులోని ఎంపీ కార్యలయంలో ఎంపీని అర్వింద్‌ను కలిసి వినతి ప్రతంను అందించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నేతలు స్థానికంగా ఉన్న విషయంను ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నేతలు చెన్న విశ్వనాథం, నగష్, భూమేశ్వర్, తిరుపతి నాయక్, పెట బాస్కర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగిత్యాలలో మంత్రి పొన్నంకు ఘన స్వాగతం

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గొల్లపల్లి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు బుధవారం జగిత్యాలకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం లభించింది. వేర్వేరు సందర్భాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పూలమొక్క అందించి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి శాలువ కప్పి స్వాగతించగా కలెక్టర్ సత్య ప్రసాద్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు.

జిల్లాలో మోస్తరు వర్షం

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం సగటున 39.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా ఎండపల్లి మండలంలో 75.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా మేడిపల్లిలో 9 మి.మీ కురిసింది. రోడ్లన్నీ జలమయం, బురదమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మంచిర్యాల జిల్లా కడెం ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి వేసి నీటిని దిగువకు వదులుతుండడంతో ధర్మపురి, వెల్గటూరు మండలం కోటిలింగాల వద్ద గోదావరి ఉధృతి పెరిగింది.

గ్రౌండ్‌లో బైకులు, కార్లు నేర్చుకోవడం నిషేధం

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో కార్లు బైక్‌లు నేర్చుకోవడం నిషేధమని ధర్మపురి పోలీస్ సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, చిన్నపిల్లలు ఆడుకుంటారని ఈ ప్రాంగణంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందులకు కార్లు, బైక్‌లు నేర్చుకోవడం, నడపడం నిషేధం అన్నారు. ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయుల అనుమతి లేకుండా ఎరరి వాహనాలను లోపలికి వెళ్లకూడదని తెలిపారు. ప్రైవేట్ వాహనాలు లోపల పార్కింగ్ చేయరాదని, ఎవరైన అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే ఎలాంటి పంచాయతీలు నిర్వహించరాదని, రాత్రి వేళలో అనుమానస్పదంగా, చెడు పనులు చేసినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా రాజేష్

మల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ పట్టణ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా కల్లెడ రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కిరాణా సీనియర్ వ్యాపారి శివ రామ్‌కిషన్ తెలిపారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా కల్లెడ రాజేష్, ప్రధానకార్యదర్శిగా తోట రాజేశం, కోశాధికారిగా మేడి రాకేష్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ అంశాల్లో ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం విమోచన మహిళలకు సూచించారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, వయోవృద్దుల సంఘాలు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటు తదితర అంశాల పై సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఒక రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు పావలా వడ్డీకే బ్యాంక్ రుణాలను అందిస్తుందని ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పథకాలను అందిపుచ్చుకుని మహిళా సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విమోచన, కమ్యూనిటి కో-ఆర్డినేటర్లు శ్రీనివాస్, గంగాధర్, మహేష్, మల్లేశం, మండల సమాక్య అధ్యక్షులు మార్కం వజ్ర, కార్యదర్శి కొత్త మమత, కోశాధికారి కనపర్తి సారిక, సిబ్బంది ఆరెల్లి మోహన్, అంజలి, రవి పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


కోరుట్లలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మపురి రోడ్డులో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నిరోదక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. నాశ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభమై అయిదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోదక సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీలత, హెల్త్ క్లబ్ కో ఆర్డినేటర్ నీరజ, అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ వాసాల వర ప్రసాద్, చంద్రయ్య, సాసాల మల్లికార్జున్, జ్యోత్స్న, సునీత, కాసీం, ఇర్ఫాన, యాస్మిన్, సత్యం, నరేశ్, లక్ష్మణ్, మల్లేశం, పరమేశ్, తిరుపతి, సంగీత, రక్షిత తదితరులు పాల్గొన్నారు.

●**జగిత్యాల అర్బన్:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ కాసుగంటి నారాయణ రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్ అన్నారు. బుధవారం కళాశాల లో మత్తు పదార్థాలపై విదార్థులతో మాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మత్తు పరాద్థాలను అరికట్టేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, యువత మేలుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల భవిష్యత్ అందకార మయం కావడంతో పాటు ఆరోగ్యం చెడిపోతుందని అనారు. మత్తు పదార్థాలు, గంజాయి లాంటివి వాడేవారు కనిపిస్తే పోలీసులకు టోల్ ఫ్రీ నంబర్ 134446 కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ. శ్రీనివాస్, ఎన్సిసి అధికారి పి. రాజు, అకాడమీ కోఆర్డనేటర్ డాక్టర్ సాయి మధుకర్, అధ్యాపకులు అంకం గోవర్ధన్, కె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** మదాక ద్రవ్యాల నిరోదకంపై యువత సహకారం అందించాలని కోరుట్ల సిఐ సురేష్ బాబు కోరారు. బుధవారం పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో ఎస్ఐలు చిరంజీవి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, యువకులతో కలిసి మాదక ద్రవ్యాల నియతరణపై అవగాహన కార్యక్రమంను నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులు, పోలీసులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ బాబు మాట్లాడారు. యువత మత్తు పథార్థాలకు అలువాటు పడి జీవితంను నాశనం చేసుకోవద్దని అన్నారు. అనంతరం విద్యార్థులు పట్టణంలో ర్యాలీని నిర్వహిం చారు.

●**మెట్‌పల్లిటౌన్:** యువత మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు కళాశాల విద్యా కమీషనర్ (సీసీఈ) ఏ. శ్రీ దేవసేన, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డిఎస్ఆర్ రాజేంద్ర సింగ్‌లు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బుధవారం కాలేజ్‌లో మాదక ద్రవ్యాల నిరోదక ప్రతిజ్ఞ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ మాట్లాడుతూ గంజాయి, కొకాయిన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు యువత బానిస అవుతుందని,దాన్ని నిరోధించడానికి ఆధునిక యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మాదక ద్రవ్యాలను నిరోధించడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందాని, అందుకు యువత సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి. దేవన్న మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా నష్టపోతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, లెక్చరర్లు అంజయ్య, దశరథం, శ్రీకాంత్, సత్యశోధనలతో పాటు బోధనేతర సిబ్బంది లక్ష్మీ నారాయణ, బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

నియామకం

గొల్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ గాయత్రీ మాత విశ్వబ్రాహ్మణ యువజన సంఘం పట్టణ శాఖ అధ్యక్షులుగా తిప్పర్తి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని విశ్వ బ్రాహ్మణ సంఘం భవనంలో విశ్వబ్రాహ్మణులు సమావేశమై నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మారుపాక లింగబాబా, ఎదులాపురం నర్సింహాచారి, దుంపేటి సందీప్, ప్రధానకార్యదర్శిగా సజ్జనపు రవి, సహాయక కార్యదర్శిగా ఇందూరు నిరంజన్ చారి, కోశాధికారిగా శ్రీకోటి నీలకంఠం, గౌరవఅధ్యక్షులుగా దేవరకొండ కరుణాకర్, సలహాదారులుగా పొలుకల దీపక్, తుమ్మనపల్లి బ్రహ్మచారి, కార్యవర్గ సభ్యులుగా ఎదులాపురం సాయికుమార్, రాగివెంకటేష్, సజ్జనపు భూమాచారి, మండల గురుచరణ్, దుంపేటటి ప్రణయ్, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు పొలుకల రాజగణేష్, దేవరకొండ కరుణాకర్, ఎదులాపురం లక్ష్మణాచారి, తాడూరి సత్యానారాయణ, కట్ట సత్యానారాయణ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు మంత్రుల ఘన నివాళి


సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గొల్లపల్లి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాప న్న విగ్రహానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, నిజామాబాద్ మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్‌లు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్లాల ని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవి దంగా వేరు సందర్భంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సహకారంతో డిపోకు ఆదాయం

కోరుట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల స్వయం స్ఫూర్తితో కోరుట్ల డిపోకు ఆదాయం పెరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్ కండక్టర్ల విధులతో ఆదాయం పెరగడంతో వారిని అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మనోహర్ మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో ఆర్టీసీ సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేసి కోరుట్ల డిపోను ఆదాయంలో మందువరసలో ఉంచారన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ ఆమోదించాలి

కథలాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు న్యాయం చేయాలన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కోరుట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పరాజుపూర్ గ్రామ కార్యదర్శి గణేష్ కటుంబానికి బుధవారం ఎంపీడీఓ రామకృష్ణ రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. గణేష్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల ఖర్చులతో పాటు ఇతర ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న నగదును అతని కుటుంబానికి అందించారు.

అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ యజమానులకు సూచించారు. బుధవారం పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమీషనర్ రవీందర్ ఆధ్వర్యంలో పలు వార్డులలో శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులకు మున్సిపల్ అధికారులు కలిసి ఇండ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతంలో ఉండాలని సూచించారు. శిథిలావస్తకు చేరుకున్న వారికి నోటీసులను అందించాలన్నారు. అత్యవసర పరిస్థితులతో మున్సిపల్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూం 9100039255 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.